# తెలుగు వాణి

[http://www.austintelugu.org](http://www.austintelugu.org) e-mail: austintelugu@yahoo.com

మనిషి, మరో మనిషితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోవాలన్నా, సామరస్యం పెంపొందించుకోవాలన్నా భాష చాలా ముఖ్యం. మాటలాడడం అంత కన్నా ముఖ్యం. రెంటికీ మాతృక స్పందన. స్పందించే హృదయం ఉన్నా, మన(సు) లోని భావాలను ఇతరులకి అందించాలంటే, అప్పుడప్పుడూ మొఖమాటమూ, కట్టు బాట్లూ, ఆచార వ్యవహారాలూ మధ్యలోనే అడ్డుపడుతూ ఉంటాయి. ఇన్ని బాలారిష్టాలను దాటి "పలుకు" బయటపెట్టి, భావ వ్యక్తీకరణ కావిస్తేనే కాని, మన మనసులో ఏముందో అవతలి వారికి తెలియనే తెలియదు. "కేవలం కళ్ళతోనో, చేష్టల ద్వారానో అభిప్రాయాలు వ్యక్తపరచలేమా?" అంటే, చెయ్యొచ్చు, కానీ భాష ద్వారా సాధ్యమైనంతగా అది సాధ్యం కాదూ అని, నా అభిప్రాయం. మా మామ్మ గారు వారంలో కొన్ని రోజులు మాటలు ఆదా చేస్తూ, మౌన వ్రతం పాటించే వారు. ఆవిడ నియమం ఆవిడకి బాగానే ఉండేది కానీ, చుట్టూ ఉన్న వారికే ఆవిడ చేష్టలూ, సంజ్ఞలూ అర్థం కావడానికి కష్టం అయ్యేది. అప్పుడప్పుడూ కాగితాలూ, కలమూ కూడా అవసరం అయ్యేవి. మనలో కొందరు, మాట్లాడుకొంటారు కానీ, అది కేవలం పై పై సంభాషణ గానే మిగిలి పోతుంది తప్ప, ఎదుటి వారి మనసును తట్టి లేపేదిగానో, మన భావాలతో అవతలి మనసును ప్రతిస్పందించేది గానో ఉండదు. మరి కొందరు, గట్టి వాగ్ధాటి ప్రదర్శిస్తారే తప్ప, అసలు వారేమనుకొంటున్నారో అవతలి వారికి తెలిసే అవకాశమే ఇవ్వరు.

అక్కడ మన దేశం లో అయితే ప్రతి చిన్న విషయానికీ థాంక్యూ-లూ, సారీ-లూ, ఇంకా ఐ లవ్‌యూ, మిస్‌యూ వగైరాలు చెప్పరు. ఒక తండ్రి కొడుకుని ఏ పనైనా "బాగా చేశావు" అంటూ పొగిడితే, అది ఆయుక్షీణంగా పరిగణించే సంస్కృతి మనది. కానీ, ఇక్కడి పాశ్చాత్య వాతావరణంలో అటువంటి సిగ్గెగులను వదిలేసి హావ భావాలను బయట పెట్టడమే మంచిదిగా భావిస్తారు. ప్రొద్దున్నే, ముక్కూ మొఖం తెలియని వారైనా నవ్వుతూ హలో చెబితే, మన రోజెంత ఆహ్లాదకరంగా వుంటుంది చెప్పండి. అలాగే, పిల్లలు చేసే ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ, అడుగడుగునా వారిని ఉత్తేజ పరిచే మాటల ద్వారా ప్రోత్సహిస్తూ ఉంటే వారిలోని ప్రజ్ఞా పాటవాలు మరింత పరిమళించే అవకాశం వుంది. భావ వ్యక్తీకరణలో మరొక్క అడుగు ముందుకు వేసి అక్షరాలా అక్షరాలలో పెట్టడం కూడా మంచిదే. ఇప్పుడయితే చేరాతలూ, ఉత్తరాలూ లేవు కానీ, ఎలక్ట్రానిక్‌మీడియాలూ, ఈ మెయిళ్ళూ వున్నాయి కదా. పాత కాలం నాటి కవితా గోష్ఠులూ, ముషాయిరాలూ లేవు గానీ, ఊరూరా సాహితీ సదస్సులూ, సభలూ, సంగీత కచ్చేరీలూ జరుగుతూనే వున్నాయి కదా.

అయితే, నిజాన్ని నిష్కర్షగా చెప్పాలన్నా, సున్నితంగా తెలియజేయాలన్నా ముందు మనం వినడం నేర్చుకోవాలి, దానితోనే భావ వ్యక్తీకరణకి అక్షరాభ్యాసమూ చెయ్యాలి. ఏ విషయాన్నైనా, పది మందికీ సభాముఖంగా తెలియచేయాలంటే, సభ్యతగా, సందర్భానికి తగినట్లుగా మాటలాడడమూ, వ్రాయడమూ అలవరచుకోవాలి. అన్నింటికీ ముందు స్పందించాలనే "తపన" ముఖ్యం. దానికి తోడు, మన విలువైన భాషనూ, సంస్కృతినీ మరచిపోతున్నామన్న బాధా, పరిరక్షించుకోవాలన్న తాపత్రయమూ పుష్కలంగా ఉన్నా, ప్రవాసాంధ్రులలో "పలుకు" యెందుకు తక్కువయ్యిందంటారు? ఏ మ్యాగజైనును ప్రారంభించినా, మరే సువనీరు కార్యక్రమం తలపెట్టినా ఆర్టికల్సు సేకరించడానికి కూడా, అడ్వర్టైజ్మెంట్లంత కష్టపడాలెందుకు ? ప్రతీ సమావేశం లోనూ, మంచి స్పృహా, ఆవేశం వున్న వాళ్ళు కూడా మాకు పరాయి భాషలోనే మాట లాడడం సులభం అంటూ రూటు మార్చేస్తున్నారెందుకని ? మాతృ భాష వల్ల ఉపయోగం లేదనో, తెలుగు మాటలాడడం వలన లాభం లేదనో చెప్పకండి. తల్లికి వయసుమీరిందని చులకనగా చూస్తామా ? అలాగే మాతృ భాషకూడా. భాషతో పాటుగా, దానితో మిళితమైన మన సంస్కృతీ వారసత్వాన్ని మరిన్ని కాలాలు పరివ్యాప్తి చేయవలసిన బాధ్యత కూడా మన పైనే వుంది. పని వత్తిడీ, ఉరుకుల పరుగుల జీవన విధానమూ, వగైరా, వగైరా... ☺ వ(కు)ంటి సాకులు మాని మనం కూడా తెలుగులో మాట్లాడేద్దాం, రచనలు చేద్దాం. మన అభిప్రాయాలను అందమైన చక్కని తెలుగులో వ్యక్తపరుద్దాం మరి...

**– రామ్ డొక్కా**

**అధ్యక్షురాలు**
*పద్మిని తమిరిస*

**కార్యదర్శి**
*నళిని రావు*

**సహ కార్యదర్శి**
*లక్ష్మన్న విష్ణుభొట్ల*

**కోశాధికారి**
*రాజి ఆకెళ్ళ*

**కార్యవర్గం**
*పద్మ నాథ్*
*రామ్ డొక్కా*
*విక్రాంత్ రుట్టాల*
*శ్రీనివాస్ దేవరకొండ*
*స్వామి పుణ్యమూర్తుల*
*కృష్ణమోహన్ గొబ్బూరు*

**బాలల కార్యవర్గం**
*హర్ష ఓరుగంటి*
*నీహా మండవ*
*సౌమ్య రావు*

**తెలుగు వాణి సంపాదకుడు**
*రామ్ డొక్కా*

**తెలుగుబడి నిర్వహణ**
*మందపాటి సత్యం*

* * *

***TELUGU CULTURAL ASSOCIATION***
*(A registered non-profit Organization)*
**2900 West Anderson Lane,**
**Box # 20-216A**
**Austin, TX 78757-1124**

## *వచన కవితలతో సమస్యా పూరణం*

*- శ్రీమతి లత గొబ్బూరు*

**1. అడవి తల్లి ఒడిలో చేరిన అన్నలే,**
**అంధకారం లో వెలుగులా ?**
"నేటి బాలలే రేపటి పౌరులు"
అన్నది ఒకనాటి సూక్తి,
ఆ సూక్తిని చెరిపేస్తూ,
నేటి బాలలే రేపటి అడవిలో అన్నలు"
అన్నది నిజం నిజం. .
స్వార్థ రాజకీయాలు ప్రబలి,
దయా దాక్షిణ్యాలు మచ్చుకైనా లేని,
నాలు దిక్కులా నడిచే ధర్మాన్ని,
నిర్దాక్షిణ్యంగా నలిపేసి,
నవ శక్తులను, యువ శక్తులను,
నిర్వీర్యం చేస్తూ,
చీకటి దారులకు తోసే,
ప్రభువుల విధానాలకోర్వలేక,
అలా అని తెలిసీ చేసేది లేక,
నిరాశా నిస్పృహలతో,
ఎన్నాళ్ళీ స్వార్థ భారతం ?
చీకటి మాటున దాగి,
అడవి తల్లి ఒడిలో చేరిన అన్నలే,
అంధకారం లో వెలుగులా ?

**2. ప్రభాత కిరణాలు ప్రసరించే వేళ,**
**ఆపినా, ఆగునా అవనిపై సూర్యోదయం ?**
ప్రతి వెలుగూ విజయానికి సంకేతం,
అరుణకాంతుల సూర్యోదయం. .
ప్రతి ఓటమి చీకట్లకి చిహ్నం. .
జీవితపు ఒడిదుడుకులను,
వెలుగు నీడలను,
తన ఉదయాస్తమయాలలో,
నిక్షిప్తం చేసుకోని,
ప్రతి మలి ప్రొద్దుకు,
మరో తొలి ప్రొద్దు తప్పదని,
చెప్పకనే చెబుతూ,
జీవన సౌందర్య లహరులలో,
విజ్ఞాన జ్యోతులను వెలిగించే,
ప్రభాత కిరణాలు ప్రసరించే వేళ,
ఆపినా, ఆగునా అవనిపై సూర్యోదయం ?

## *పిల్లల పాటలు*

*- శ్రీమతి కృష్ణ సుగుణ శీల*

**1. చెప్పవే అమ్మా**
చెప్పవే అమ్మా నాకు కథ ఒక్కటి,
విప్పి తెలియ జెప్పు గట్టి చిక్కు ఒక్కటి. .

అల్లరెంత చేసినా, కల్లలెన్ని ఆడినా,
నల్లనయ్య అంటేనే ఇష్టమెందుకే,
అంత ఇష్టమెందుకే ? -- చెప్పవే --

పసి పాపలందరికీ మామలెందరున్నా,
చందమామ అంటేనే ఇష్టమెందుకే,
అంత ఇష్టమెందుకే ? -- చెప్పవే --

**2. అమ్మా కావాలి**
అమ్మా కావాలి నాకు బొమ్మ ఒక్కటి,
ఆటలాడు బొమ్మ, మాటలాడు బొమ్మ,
అచ్చం నాలాగే ఉండే, ముచ్చటైన బొమ్మ -- అమ్మా --

తళ తళ మెరిసేటి కళ్ళు,
మిల మిల మెరిసేటి పళ్ళు,
రెండు జడలు, పట్టు గౌను,
అచ్చం నాలాగే ఉండే, ముచ్చటైన బొమ్మ -- అమ్మా --

ప్రతి రోజా బుజ్జగించి బువ్వ పెట్టుతానే,
అ-ఆ, ఇ-ఈ లు బాగ నేర్పించుతానే,
లాల పోసి, జోల పాడి నిద్ర పుచ్చుతానే,
అచ్చం నీలాగ నేను, ముద్దులాడి పెంచుతానే -- అమ్మా --

## *అప్పాయింట్‌మెంట్*

*- రామ్*

ఎన్ని ఏళ్ళయ్యింది నిన్ను చూసి,
ఏదో ఇలా ఉన్నా, కళ్ళు కాయలు కాచి
ఎంతో ఎత్తుకి ఎదిగావు నువ్వు,
నిన్ను చూసి గర్వంతో పొంగి పోయాను నేను

ఆశల రెక్కలతో అంబరానికెగిరావు నాడు,
నా ఊపిరులూది నిచ్చెనలేశాను నీకు
మళ్ళీ వస్తానని వాగ్దానాలు చేశావు నువ్వు,
విరహపు మగతలో, మత్తులోకి జారాను నేను

ఇన్నాళ్ళకి కలిశావు - కాలం కాని కాలంలో,
ఇలా ఇక్కడ వెలిశావు - దేశం కాని దేశంలో

నీ బిజినెస్‌లో వాటా అడగను,
నీ విజయానికి నేనడ్డు పడను
నీ ఆర్జన నాకొద్దు,
అసలా తర్జన భర్జనలొద్దు

నీ సున్నిత హృదయాన్ని,
ఆధునికత కలచి వేస్తోంది,
మళ్ళీ గాంభీర్యాన్ని అడ్డుపెట్టుకోకు,
మమతల మందు పూసుకో

ఆనాటి అమాయకతనూ,
ఆ అల్లరి నవ్వునూ,
మరోసారి పైకి రానీయవూ !

మన చిన్ననాటి వైకుంఠం,
కళ్ళముందు కదిలేలా,
మూసిన నీ గుప్పిట తీయవూ ! !

నేస్తం -

నిన్ను తనివి తీరా చూడాలని వుంది,
ఆ డాలరు ముసుగు తియ్యవూ !
నీతో మనస్ఫూర్తిగా మాటాడాలనుంది,
నాకో అప్పాయింట్‌మెంట్ ఇయ్యవూ ! !

# చంద్ర హారం

- శ్యామ్ సోమయాజుల

"అది చూపించండి" వేలెత్తి చూపిస్తూ అంది భారతి. భద్రంగా, ప్రక్కనున్న వాటికి తగలకుండా తీసి గాజు బల్ల మీద పెట్టాడు. పెళ్ళయి పదేళ్ళయినా ఒక్క నగా చేయించలేదని, పట్టు బట్టి ఒప్పించాడు ఆమె భర్త గోపాలకృష్ణ. నగల వ్యామోహం లేకపోయినా, చిన్నప్పటి నుండీ పండుగలకీ, పబ్బాలకీ అమ్మ చంద్రహారం పెట్టుకొని మురిసిపోయేది. ఎప్పుడన్నా చేయించుకొంటే అలాంటిది చేయించుకోవాలని ముచ్చట పడేది. ఆంత బరువైనవి కాకపోయినా, తన తాహతుకి సరిపడేవే చూస్తోంది. "ఇంత పల్చగా వుంటే మెడమీద నిలువదు" సలహా ఇచ్చింది, తోడు వచ్చిన భారతి తల్లి. ఎన్ని చూసినా ఏదో లోపం. అంత ఖరీదు పెట్టి కొన్నప్పుడు కాస్త ఎక్కువైనా బాగా నచ్చిందే కొనాలని వుంది భారతికి.

అప్పుడు పడింది దాని మీద భారతి దృష్టి. నిగనిగా మెరిసి పోతోంది. కనకానికి సరిపడా తెల్లనిరాళ్ళు. సరైన ఆకారంలో, అతి సున్నితంగా మరింత నాజూగ్గా పొదిగి వున్నాయి. భారతి కళ్ళలో వెలుగు చూసి వెంఠనే తీశాడు, ఆ నగని, ఆ దుకాణం యజమాని. "నా దగ్గరున్నవాటన్నిటిలోకీ ఇది తిరుగు లేనిదండీ, సూరత్‌లో ఈ మధ్యనే పరిచయం అయ్యారు, ఈ వజ్రాల్ని కోసిన వాళ్ళు" ఇంకా ఏదో చెప్ప బోయాడు. పెట్టె లోంచి తీసి మెడకి పెట్టి చూసుకొంది అద్దంలో. నేటి వనితనానికి నిదర్శనం అన్నట్లుంది, భారతి పలు కోణాల్నించి ఆ నగని అలా చూస్తూ ఉండిపోయింది..

"చాలా బాగుందమ్మా ఇది, తేలిగ్గా వున్నా అతి నాజూగ్గా వుంది" చెప్పింది భారతి తల్లి. "ఎంతన్నారండీ ?" అంది భారతి ఇంకా అద్దంలో చూసుకొంటూ. "...." చెప్పాడు. తల్లీ, కూతురూ మొఖాలు చూసుకొన్నారు. తను అనుకొన్న దాని కంటే దాదాపు పదివేలు హెచ్చు. భారతి తడబాటు గమనించి అంది తల్లి నెమ్మదిగా – "ఎలాగూ ఇంత పెట్టి కొంటున్నావుకదా, ఇది నీకు ఎంత గానో నచ్చింది. అల్లుడుగారేమీ అనుకోరంటే కొనుక్కో, మళ్ళీ మళ్ళీ ఇలాంటి అవకాశం రావద్దూ.." "ఆయన ఏమంటారో ఏమో, కొనుక్కోమన్నారు కదా! అని, మరీ ఇంత పెట్టేస్తే బాగుండదేమో అని చూస్తున్నాను. డబ్బు లేక కాదు, అనుకొన్న దానికంటే చాలా ఎక్కువ అవుతుందనే నా తడబాటు" అన్నది భారతి.

"ఇదేమీ అరిగిపోయే వస్తువు కాదు కదా, పెట్టుకొన్న నాళ్ళూ పెట్టుకొని అవసరం వస్తే అప్పుడే అమ్మేసుకోవచ్చు. డబ్బు విషయం ఫరవాలేదనుకొంటే, కొనేసుకో. అద్భుతంగా వుంది నగ మాత్రం" తర్కం చెప్పి ప్రోత్సహించింది భారతి తల్లి. మనసులో రకరకాల ప్రశ్నలు. "మేలిమి బంగారమే అయినా, ఈ వజ్రాల సంగతి మాకు పెద్దగా తెలీదండీ. చూడ్డానికి బాగానే వున్నాయి. వీటి విలువ ఎలా కడతారు ?". "బంగారంలా కాదు, ముత్యాలూ, పగడాలూ, వజ్రాలూ.. వాటి విలువ తూకాలతో ముడిపడదు" అంటూ నగని భూతద్దం క్రింద పెట్టి చూపించాడు షాపు వాడు, అన్నీ తెల్ల రాళ్ళే, ఏ రంగూ మిళితం కాలేదు, పగుళ్ళు అంత కన్నా లేవు.

మరో పావు గంట పరిశీలించి "మా వారు కౌలాలంపూర్‌కి వెళ్ళారు పని మీద, ఆయన్ని అడిగి కొందామంటే, ఎప్పుడు ఫోను చేస్తారో తెలియదు. మీరు, మా కోసం, ఓ రెండు రోజులు, ఈ హారాన్ని ఉంచుతారా ?, ఆయనతో మాట్లాడి చెబుతాను?" అడిగింది భారతి. "ఇది చాలా ఖరీదైనదమ్మా. గాజులన్నా, జుంకీలన్నా బేరం పోయినా ఫరవాలేదని మీ కోసం అట్టే పెట్టేవాడిని. అసలే పెళ్ళిళ్ళ సీజను. లోపల పెట్టుకొంటే, ఆ పై మీరు కొనక పోతే, అమ్మే మంచి అవకాశం చేజారిపోయినట్టే". అతను చెప్పిందీ భావ్యంగానే వున్నట్టనిపించింది. మరిప్పుడేం చేసేటట్టూ ? తన భర్త ఆలోచనా ధోరణి తనకి తెలుసు. ప్రతి వస్తువుకీ ఒక విలువ ఉంటుంది, ఎంత ఎక్కువ పెడితే అంత మంచిది వస్తుందన్నది వాస్తవం. స్తోమతకి తగట్టే కొనాలని. అలాగని మనస్పూర్తిగా నచ్చినది కొనకపోతే డబ్బులు వృధా చేసినట్లే. మరి కాసేపు తల్లితో సంప్రదించి ఒక నిర్ణయానికి వచ్చింది భారతి. "సరేనండి, ఈ హారం ఇవ్వండి. నేనేదో ఆయనకు నచ్చ చెప్పుకొంటాను. ఇంత పెట్టి కొన్నప్పుడు నచ్చకపోతే లాభమేముందీ ?" అన్నది డబ్బులకోసం పర్సు తీస్తూ. "దీన్ని మళ్ళీ కడిగించి, కాస్త మెరుగు పెట్టిమ్మంటారా ?" అడిగాడు, హారాన్ని ముఖ్మల్‌పెట్టెలో పెడుతూ. "అలాగే! రేపు వచ్చి తీసుకొంటాం మరి", అని చెప్పి డబ్బులిచ్చేసి రసీదు తీసుకొని వెళ్ళి పోయారు, భారతి, ఆమె తల్లి.

మరునాడు ప్రొద్దున్నే వచ్చారు మళ్ళీ ఆ నగల దుకాణానికి. ఇద్దరి మొఖాల్లో ఆందోళన. పర్సు లోంచి రసీదు తీస్తూ అంది భారతి – "నిన్న భయపడ్డట్టే జరిగిందండీ, రాత్రి మావారు ఫోను చేశారు. ఇంతేసి డబ్బులు నగలకి పెట్టడమెందుకూ ? అన్నారు. ఆయన మనసు నాకు బాగా తెలుసు. ఏదో అయి వుంటుందక్కడ. బిజినెస్సుకి నష్టం వచ్చి వుంటుంది. ఎప్పుడూ కొంటానంటే వద్దనరు". సంజాయిషీ చెప్పుకు పోతోంది. అటు భర్తని చెడ్డవాణ్ణి చెయ్యటం ఇష్టం లేదు. "ఏం చేయగలనమ్మా నేను ?" అడిగాడు యజమాని. "హారం తీసేసుకోండి. మళ్ళీ కొనుక్కొంటాను ఎప్పుడైనా. ఈ సమయంలో ఆయనపై ఈ భారాన్ని వేయడం నాకిష్టం లేదు" భారతి కళ్ళు నిండాయి. "అదెలాగండీ, ఒక్కసారి కొనుక్కొన్నాక మళ్ళీ తిరిగి తీసుకోవడం నగల వ్యాపారం లోనే లేదు. మీ కోసం ఇప్పుడు నేను సడలించలేను. అసలే చాలా ఖరీదైనది". "నిన్నటి నుండి అది మీదగ్గరే ఉంది కదండీ ? మేము ఇంటికి తీసుకు వెళితే, ఏదో మోసం అనవచ్చు. గాట్లు పెట్టారనొచ్చు. ఎన్నేళ్ళ నుండో మీ దగ్గర కొంటున్నాం కదా అని, మీరర్ధం చేసుకొంటారనే వచ్చాము." భారతి తరపున తల్లి వాదం.

"ఇప్పుడు మీరు దీన్ని అమ్మితే తూకం లెక్కన అమ్మాలి. రవ్వలున్నా, ముత్యాలున్నా, పగడాలున్నా అమ్మితే మీకు నష్టమే కదా ?" " ఆ సంగతి మాకు తెలుసండీ. అందుకే కదా మిమ్మల్ని ఇంతగా అడుగుతున్నది. ఒక్కరోజులో ఆ రాళ్ళ విలువ పడిపోయిందా ? లేక అవి నాసి రకం వజ్రాలా ?" పోరాటం సాగుతోంది. మరో అరగంట సాగింది. నష్టానికి అమ్మడం గిట్టలేదు భారతికి, అదీ ఒక్క సారన్నా ధరించకుండా. "అమ్మిన వస్తువుని తిరిగి తీసుకోవడం, తలుపు తట్టి వచ్చిన లక్ష్మిని తిరిగి వెనక్కి పంపడమే" అవుతుందని ఆ యజమాని పాయింటు.

"సరేనండీ, ఈ ఒక్కసారికీ తీసుకొంటాను. మీ కాపురం చక్కగా వుంటే అదే చాలు. మేలిమి బంగారం, అంతకన్నా మేలుజాతి వజ్రాలు. వాటి విలువ ఎప్పటికీ పోదు. మీ డబ్బులు తెచ్చిస్తానుండండి" అన్నాడు రసీదు తీసుకొని లోపలికి వెళుతూ – ఆఖరికి తగడం అతని వంతయ్యింది. లోనికి వెళ్ళి ఒక చేత్తో డబ్బు, మరో చేత్తో హారపు పెట్టెతో తిరిగి వచ్చాడు పది నిమిషాలయ్యాక. మరో సారి పెట్టె తెరచి చూసుకొంది భారతి, మురిపెంగా ఆ హారాన్ని.

"చూడండీ, మీకింత వ్యథ కలిగించినందులకు క్షమించండి. అది నా ఉద్దేశ్యం కాదు. ఈ హారం నిజంగానే అద్భుతంగా వుంది. నేను మళ్ళీ ఆలోచించి చూశాను. మా అమ్మ దగ్గర అప్పు తీసుకొనైనా ఈ హారం తీసుకొంటాను." జవాబు కోసం ఎదురు చూడకుండా, హారపు పెట్టె పుచ్చుకొని వెళి పోయింది భారతి. తల్లికి ఆశ్చర్యం వేసింది. చేసేది లేక తనూ వెంట వెళ్ళింది.

కారెక్కాక నిలదీసింది భారతిని. "అదేమిటే, మీ ఆయన వద్దన్నా కూడా, ఇంత వ్యామోహం దేనికీ ?" పగలబడి నవ్వింది భారతి. "సారీ అమ్మా, నీకు నిజం చెప్ప లేదు. చెప్తే ఇంత బాగా నటించలేవని తెలిసే చెప్ప లేదు. ఆయన కొనుక్కోమన్నారు. కానీ ఇంత పెట్టి కొంటున్నప్పుడు మనం మోసపోకూడదనే, ఈ ఉపాయం చెప్పారు. అంత ఖరీదైన నగని తిరిగి తీసుకోడానికి సిద్ధమైనాడంటే, ఇది నిజంగా అత్యుత్తమ జాతిదే అయి వుండాలి. అతని వ్యాపారం అతనికి బాగా తెలుసు కదా?" తల్లి మొఖంలో ఆశ్చర్యం రెట్టింపవటం గమనించి నవ్వింది. "సరే! నన్ను పిచ్చి దాన్ని చేశారా నువ్వూ అల్లుడూ కలిసి.." అన్న ప్రశ్నకి గల గలా నవ్వుతూ "నిన్ను కాదు, ఆ యజమానిని, ఆయనింకా తేరుకొని ఉండరు" అంది, నిండు చందమామ లాంటి భారతి, చక్కటి "చంద్రహారం" తనదైన ఆనందంలో.

## శ్రీ విన్నకోట రవి శంకర్‌గారి "కుండీలో మర్రి చెట్టు" కవితా సంకలనం నుండి..

### నిన్నటి కల

మళ్ళీ అప్పుడే నిద్ర వద్దు;
నిన్నటి కల ఇంకా పచ్చిగానే ఉంది.

కళ్ళల్లో గాలిదుమారం లేపుతూ,
ఎర్రటి ధూళిని రేపుతూ వస్తుంది నిద్ర.
రెప్పల తలుపులు టప టప కొట్టుకుని
ఒక్కసారిగా మూతపడతాయి.

ఎప్పుడో విరిగిన జ్ఞాపకాల దుంగల్ని
తెప్పల్లా మోసుకొంటూ,
వరదై వస్తుంది కల.

నిన్నటి నిద్రలో నేను
నిరాశ్రయుడి నయ్యాను.
నిన్నటి వరదలో
ప్రాణ భయంతో విలవిల్లాడాను.
మళ్ళీ అప్పుడే నిద్ర వద్దు
నిన్నటి ఆ కల ఇంకా పచ్చిగానే
ఉంది.

కనిపించని గాయం కల –
వచ్చేపోయే నిద్ర ఎప్పుడో చేసి
వెళ్ళిపోతుంది.

ఊహల, భయాల
మృత్యు రహస్యం కల.

మరణించిన మిత్రునిలా
వేల భంగిమలలో కనిపించి,
అంతులేని ఆలోచనల మధ్య
తళుక్కుమని మెరిసేది కల.

నిన్నటి కల
ఇంకా పచ్చిగానే ఉంది.

### శివకాశి

ఇతనికెవరూ వీరత్వాన్ని
వెన్నతో పెట్టి తినిపించలేదు.
ఒళ్ళో కూచోబెట్టుకుని,
సాహస గాథల్ని
ఓపిగ్గా వినిపించలేదు.

అయినా,
ఉదయమయ్యేసరికల్లా
ఈ పసివాడు
మృత్యువు గుహలోకి
నడచిపోతాడు.
చీకటిపడేదాకా అక్కడే
దానితో ఆటలాడతాడు.

సమాజపు దట్టమైన అడవిలో
అతను మూల మూలకీ వెళతాడు.
భాష నేర్చిన మృగాలమధ్య
భయంలేకుండా తిరుగుతాడు.

అయినా అతనిపేరు
ఎవరికీ పెట్టరు.
అసలతని ఉనికినే ఎవరూ
ఆనవాలు పట్టరు.

అతని జీవితంలో
అల్లరి లేదు, ఆటల్లేవు,
తప్పటడుగుల్లేవు,
తడబడే మాటల్లేవు.

కళ్ళ వెలుగుల్ని
కాకరపువ్వొత్తులకీ,
చిరునవ్వుల్ని మతాబులకీ ఇచ్చేసి,
అమావాస్య జీవితంలోనే తను
అమాయకంగా మిగిలిపోతాడు.

### మోళీ

నీ క్షణికానందాన్ని
ఆమె తొమ్మిది నెలలు మోసింది.

వీడైతే దానిని
నూరేళ్ళూ మోయవలసినవాడు.

ఇంకా నీ బెల్లు చారల్ని,
వేళ్ళ ఆనవాళ్ళని కూడా
ఎక్కడ మొయ్యమంటావు చెప్పు !

నీకోసం ఆమె
తన నవ్వులన్నీ మూటగట్టి
ఇచ్చేసింది.

వీడైతే, తన బాల్యాన్నే బొమ్మ చేసి
నీ చేతుల్లో పెట్టాడు.

ఇంకా ఏం ఇమ్మంటావు చెప్పు !

ఇంత జరుగుతున్నా,
ఇంకా నీ జీవితపు మోళీ
అద్భుతంగా ఉందని
లోకాన్ని నమ్మించడానికి,
ఆమె బాధల తాటి మీద
పడిపోకుండా నడిచి చూపించాలి.

వీడు కోతిలా గంతులేసి,
కిచకిచలాడాలి.

ఇందులో ఏదో మోసం ఉంది.
నీ అధికారపుటంధకారంలో
జరుగుతున్న ఆటలో
ఎక్కడో –
క్షమించరాని దోషం ఉంది.

## *Down the memory lane* — *Ravi Mandava*

In the jewel of a poem “*The Road Not Taken*”, Robert Frost mused “Two roads diverged in a wood, and I - I took the one less traveled by, And that has made all the difference”. The shibboleth of this poem perennially reverberates in resonance during my pensive moments evoking nostalgic thoughts of my halcyon days in childhood. Growing up in a rural town, I had the privilege of unfettered access to public libraries with ample time to peruse children’s literature during summer vacations as well as school days. Other factors that contributed immensely to my penchant were a brother who is an avid bibliophile (in collecting and reading), easy schedules in public schools that we attended, and lesser duress and expectations to excel academically in an era of lesser competition and more opportunities for extra-curricular activities.

When we were around twelve years old, we were quite fascinated by captivating stories in Chandamama and Bommarillu. As the adage goes “A picture is worth thousand words”, resplendent illustrations by Vaddadi Papaiah and others etched awe-inspiring aspirations among us. As budding dilettantes, we assiduously dabbled in home-made imitations of these great magazines with our own fables of intrigue, valor, adversity and prosperity with hand-drawn pictures some of which might have resembled VaPa’s rich illustrations as feeble attempts of replicas. Nonetheless, we were quite content with encomiums gratuitously doled out by our kind-hearted aunts who, I’m sure, had noble intentions of encouraging saplings of art among us, even when our works were quite mundane and soporific in content and presentation. Fortunately, we were in blissful childhood years of gullibility and community nourishment.

A couple of monsoon seasons later, as we got into early teens, one summer month, we stumbled into stupendously sublime literary works of translation by Dr Nanduri RamaMohana Rao. Like a godteacher, he opened the doors for us to the world of adventure and fun depicted in several classics such as Mark Twain's "Adventures of Tom Sawyer" and "Adventures of Huckleberry Finn", RL Stevenson's "Treasure Island". The essence and spirit of those eminent authors originally encapsulated in their classics was exquisitely presented by Dr Nanduri in a fashion that is unforgettable, riveting, jocund, and engrossing. Tom and Becky's heart-stopping exploration in McDougal's cave, Huck and Jim's tenacious rafting in the foggy and rapid waters of the Mississippi river, Jim's audacious voyage over the Caribbean ocean with ruthless buccaneers are a few examples of enthralling escapades we could only dream of as adolescents. Canoeing with my brother over a small lake by the main library in Movva, swimming with my cousins in a rain-flooded rivulet in Penamakuru, wandering in woods with my brother in Thondalagopavaram are a few of my attempts to act out some of those empyrean escapades.

One native book that made a lasting impression was a story about two brothers called Ramanna and Polanna who got marooned in a forest like Mowgli in Rudyard Kipling's “Jungle Book” but differed in the main theme that this book depicted the two brothers to be heroic in hunting, fishing, making shelters like Daniel Defoe's “Robinson Crusoe”. It also had an exciting and climactic ending wherein the two brothers use bows and arrows from the treetops to foil an attempt by a group of bandits to rob a family. Unfortunately, despite our innumerable attempts, we could not find this book again nor remember its title or its author's name, and I'd be very much grateful to whoever can give me a tip in finding this paragon of bravery, originality, and bonhomie.

A few literary works, some of them translated in Telugu, by Russian litterateurs such as Tolstoy, Maxim Gorky, etc also imparted fodder for learning about activities of children on the streets of Moscow against the backdrop of a revolution. Most pragmatic works were Yakov Perelman's series of "Physics for Entertainment" which gave us ideas and inspiration for making paper boomerangs, magnetic motion loops, and water-coin tricks. Preponderance of life's perils and hardships was lucidly felt from the works such as RK Narayan's "Swami and His Friends" and Rabindranath Tagore's short story about a boy leaving his bucolic village and moving to an urban sprawl in Calcutta and finally succumbing to pneumonia. One quote that stuck in my mind was "A fourteen year old is neither a child nor an adult; neither his decisions are respected nor his acts of play are appreciated".

All in all, these and several other outstanding works of unfathomable imagination, creativity and serendipity made such an impression on me inculcating a strong predilection for adventures and forays into remote areas one of which has landed me in this great land of opportunities. As great authors such as Mark Twain, Tagore, etc leave behind them “footprints in the sands of time”, it's a gratifying and rejuvenating experience for me to look down (rather, up) my memory lane with utmost admiration and sheer delection.

To be good is noble, but to show others how to be good is nobler, and no trouble. -- Mark Twain

# ద్విపాత్రాభినయం

- సత్యం మందపాటి

ద్విపాత్రాభినయం అనే ఈ కథ ఇద్దరు మిత్రులు సినిమాలో నాగేశ్వర్రావ్ రెండు పాత్రలు అభినయించటం గురించి కాదు. ఒకే మనిషి, ఒకే రకమైన సన్నివేశాలలో, రెండు విభిన్న పరిస్థితులలో వేర్వేరు స్వభావాలను చూపించటం గురించి. అంటే డాక్టర్ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్ లాగా, అన్నమాట.

చిన్నప్పుడు డాక్టర్ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్, మొదటిసారి చదివినప్పుడు అనుకొన్నాను - "ఈ పాత్రలో సహజత్వం లేదు, ఏ మనిషీ ఇలా ప్రవర్తించడు, ప్రవర్తించ లేడు" అని. త్వరలోనే పెరిగి పెద్దయి నా అనుభవాల ద్వారా, -నా ఆలోచన తప్పు- అని సరిదిద్దుకొన్నాను. మన చుట్టూ ఉండే మనుష్యుల లోనే "ద్విపాత్రాభినయం" చేసే వ్యక్తులు వున్నారు. వివిధ రకాల మనుష్యులనీ, వారి మనస్తత్వాలనీ పరిశీలించే వారికి ఈ విషయం విపులంగా అర్థం అవుతుంది. సైకాలజీ లో గ్రాడుయేట్‌కోర్సు చేస్తూ నా సైకాలజీని చదువుతూన్న మా అమ్మాయి అంటూ ఉంటుంది "ఎందుకు ఎప్పుడూ అలా కాలుగాలిన పిల్లిలా, అశాంతిగా తిరుగుతూ ఉంటావు, కాసేపు అలా విశ్రాంతిగా కూర్చుని నీ స్ట్రెస్‌తగ్గించుకోరాదూ" అని. అలా కాలుగాలిన పిల్లిలా తిరగడం కంటిన్యూ చేస్తోనే, నేను "నాకు స్ట్రెస్‌ఏమీ లేదు, చాలా రెలాక్స్‌డ్‌గా వున్నాను" అంటూంటాను మెడ వెనుక నొప్పిగా వున్నచోట అప్రయత్నంగా రుద్దుకొంటూనే. అది ద్విపాత్రాభినయం కాదంటుంది మా అమ్మాయి. అదేమిటో నాకు తెలీదు.

సరదాగా ముచ్చటిద్దామనుకొన్నా, కథకో శిల్పం ఉండాలని విమర్శకులు అంటున్నారు కనుక, ఆ శిల్పం కోసం ఒక పాత్ర, అమర శిల్పి పేరున జక్కన్న అని సృష్టిద్దాం. జక్కన్న అంటే జెకిల్‌లాగా అన్నమాట. మరి జెకిల్ ఉంటే హైడ్ కూడా ఉండాలి కాబట్టి హన్నూ అను పేరు పెడదాం ఆ రెండో పాత్రకి. నేను హైస్కూల్లో ఉండే రోజుల్లో హనుమంతరావ్ అనే మిత్రుడొకడుండే వాడు. అతన్ని హన్నూ అని పిలిచే వాళ్ళం. కనుక మనకి జక్కన్న, హన్నూ అనే పేర్లు, జెకిల్‌అండ్‌హైడ్‌కి సరిపోతాయి. వీటిలో మంచి పాత్ర ఏదీ, చెడ్డ పాత్ర ఏదీ అని చూడనక్కర లేదు. మంచి పాత్రల్లో చెడూ వుంది, చెడ్డ పాత్రల్లో మంచీ వుంది. మంచీ, చెడుల కలయిక మనిషి కనుక ఒకే పేరుకి ఒక విలక్షణమైన గుణం ఇవ్వద్దు మనం.

ఇక జక్కన్న, హన్నూ ఇద్దరు వేర్వేరు మనుష్యులు కారు. ఒకే మనిషికి వున్న రెండు వేర్వేరు ప్రవృత్తులు. ఈ పాత్రల ద్వారా, ఒకే రకమైన సన్నివేశంలో, రెండు రకాల పరిస్తితులలో, ఒకే మనిషి, ఆ రెండు ప్రవృత్తులనీ ఎలా ప్రదర్శిస్తాడో చూద్దాం. దాని కోసం, రెండు భిన్న వాతావరణాల్లో, రెండు చోట్ల, రెండు సార్లు ఈ కథ నడిపిద్దాం.

ఎయిర్ ఫ్రాన్సు వారి విమానం న్యూయార్కు నుండి, పారిస్ వెళడానికి సిద్ధమౌతున్నది. కౌంటర్ దగర జక్కన్న చేత్తో బ్రీఫ్‌కేస్‌చేత్తో పట్టుకొని, ప్రక్కనే ఒక పెద్ద సూట్‌కేసుతో నుంచున్నాడు. ముందు, లైన్లో ఇరవై మందీ, అతని వెనుక మరో పాతిక మందీ ఒకళ్ళకొకళ్ళు తగలకుండా నుంచొన్నారు. జక్కన్న ముందొక ఎర్ర జుట్టు అమ్మాయి నుంచునే ఏదో పుస్తకం చదువుకొంటున్నది. ఆ అమ్మాయి వేసుకొన్న గౌను మరీ చిన్నదిగా వుంది. నున్నటి భుజాలు, అందమైన పొడుగాటి కాళ్ళు, చక్కటి అవయవాల పొందికతో మెరుపుతీగలా కనిపిస్తోంది. ఆ కౌంటర్‌దగర లైను కొంచెం నెమ్మదిగా కదిలితే బాగుండును అని జక్కన్న మనసులో మరోసారి అనుకొని, కొంచెం దూరంగా నుంచొని, కళ్ళు అటూ ఇటూ తిప్పుటూ, కూచిపూడి అభినయం చేస్తూ ఆనందిస్తున్నాడు. అతను అభిలషించినట్టుగానే, లైను నెమ్మదిగానే కదులుతోంది. తన వంతు రాగానే, టిక్కెట్లు కౌంటర్లో ఇచ్చి, "విండో సీట్ ప్లీజ్" అన్నాడు. కౌంటర్‌దగర ఉన్న అమ్మాయి, తను ఆప్యాయంగా పెంచి, ఎర్ర రంగు వేసిన గోళ్ళు విరిగి పోకుండా జాగ్రత్త పడుతూ, కంప్యూటర్‌కీ బోర్డు మీద తన తెల్లని వేళ్ళు టకటకలాడించి, జక్కన్న కేసి తిరిగి చక చకా కదిలే తన కళ్ళని చక్రాల్లా తిప్పుతూ, రాగి జుట్టు వెనక్కి తోసి, హుందాగా తల ఎగరేసి, మెరుస్తూన్న ఎర్రని పెదాలను సున్నాలా పెట్టి "సారీ మిష్టర్‌జక్కన్నా, ఆల్ ఐ హేవ్ ఈజ్ ఎ మిడిల్ సీట్(బహుశా, ఇద్దరు లావుపాటి వాళ్ళ మధ్యన), ఈజ్ ఇట్ ఓ కే ?" అంది తన రత్నాల (కట్టుడు) పలువరసని జిగేల్‌మనిపిస్తూ.

ఆ మెరుపుకి కళ్ళు తిరిగిన జక్కన్న, ఒక్కసారి తేరుకొని, "మీ ఇష్టం" అన్నాడు నవ్వుతూ. సుతారంగా బోర్డింగు పాసు అందించి, ఈ సారి కళ్ళతో నవ్వి, పెదాలతో "హేవ్‌అ నైస్‌ట్రిప్" అన్నదామె. జక్కన్న "థాంక్స్" చెప్పి, విమానం ఎక్కే ముందే మేఘాల్లో తేలిపోతూ, ఎయిర్పోర్టులో ముందుకు నడిచాడు. ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ చెక్‌లు అయ్యాక, విమానంలో ఎక్కడానికి గేటు దగ్గర, సీట్ల వరుస నెంబర్లలో పిలుస్తున్నారు. అందరూ తమ తమ సీట్ల నంబర్లు పిలిచినప్పుడే నిదానంగా విమానం ఎక్కుతున్నారు. జక్కన్న తన సీటు నంబర్‌పిలిచే దాకా, ప్రక్కనే వున్న తెల్ల వాళ్ళనీ, నల్ల వాళ్ళనీ, ఎర్ర వాళ్ళనీ, మగ వాళ్ళనీ, ఆడ వాళ్ళనీ, పిల్ల వాళ్ళనీ చూసుకొంటూ నిలబడ్డాడు. తన సీటు నంబరు పిలిచాకా, యథా ప్రకారం ఎక్కి తన సీటులో కూర్చొన్నాడు. విమానం బయలు దేరింది. భోజనాల సమయం. ఫ్రెంచ్ ఎయిర్ హొస్టెస్ వచ్చి, భోజనాలందిస్తూ, "ఇదిగో, మీకోసం, ప్రత్యేకంగా తయారు చేసిన శాకాహార భోజనం" అన్నది, ముందూ, వెనుకా నవ్వును మిళితం చేస్తూ. ఆ నవ్వు ఒక్క క్షణం జక్కన్న కళ్ళల్లో పాదరసంలా మెరిసి మాయమయింది ఎందుకంటే, ఆ అమ్మాయి అదే నవ్వుని, ప్రక్క సీటులోని ఆసామీకి భోజనం తో బాటుగా అందిచింది. మూడు టొమాటో ముక్కలూ, ఆరు లెట్టస్‌ముక్కలూ ఉన్నాయి సాలడ్‌లో. బార్లీ గింజలూ, మొక్కజొన్న గింజలూ ఉడకబెట్టి ఇచ్చారు. రెండు పైనాపిల్‌ముక్కలూ, రెండు పుచ్చకాయ ముక్కలూ వున్నాయి మరో ప్రక్క. ఒక బ్రెడ్‌రోల్, చిన్న మార్జరీన్‌స్ప్రెడ్. జక్కన్న భోజనం తినడం పూర్తి చేయగానే, ఫ్రెంచ్ సుందరి, మన వీరవాసరం వీరుడి దగ్గరికి మీరు ఆనందించారనీ అనుకొంటున్నాను" అని ఫ్రెంచ్‌లో ఇంగ్లీషునీ, ఇంగ్లీషులో ఫ్రెంచ్‌నీ కలిపి మాట్లాడింది. జక్కన్నకి రమ్‌లో కోక్ కలిపినట్లుగా అనిపించింది. "అవును చాలా బాగుంది, థాంక్స్‌ఫర్‌ద గ్రేట్‌స్టఫ్" అన్నాడు, "జీవితంలో అలాటి భో-జ-నాన్ని, గుర్రాలు తప్ప మనుష్యులు తినరు గాక తినరు" అని ఇంటి దగ్గర భార్యతో చాలాసార్లు వాదించిన సంగతి మరచిపోయి.

ఇప్పుడు ఇదే సన్నివేశాన్ని హన్మూ ఎలా నడిపించాడో చూద్దాం –
ఎయిరిండియా వారి విమానం న్యూయార్కు నుండి లండన్‌కి వెళడానికి సన్నద్ధమవుతున్నది. కౌంటర్‌దగ్గర క్యూలో హన్మూ ఒక చేత్తో బ్రీఫ్‌కేసుతో, మరో ప్రక్క పెద్ద సూట్‌కేసుతో నిలబడి వున్నాడు. అతని ముందు లైన్లో ఓ ఇరవై మందీ, వెనుక మరో పాతిక మందీ ఉంటారేమో. ముందొక ఎర్ర చీర యువతి నిలబడే పుస్తకం చదువుకొంటున్నది. "లైన్లో నిలబడి, ఈ హడావుడిలో పుస్తకాలు చదవడం కూడాను, అదో ఫోజు.." అనుకొన్నాడు, హన్మూ మనసులో. అతని హావభావాలు టెలీపతీలో వినిపించాయో, లైన్లో తోపిడి ఎక్కువయ్యిందో కానీ, ఆమె పుస్తకం చదవడం ఆపేసి మొఖంలో విసుగు రసం ప్రదర్శిస్తున్నది. హన్మూ కూడా విసుక్కొంటూ, "లైను తొందరగా కదిలితే బాగుండును అనుకొన్నాడు", అసహనంగా అటూ ఇటూ చూస్తూ. ఆ లైను మాత్రం మరింత నింపాదిగా కదులుతోంది.

తన వంతు రాగానే టికెట్‌ఇచ్చి, "విండో సీట్ ప్లీజ్" అన్నాడు. కౌంటర్‌దగ్గర వున్న అందమైన అమ్మాయి, హన్మూ టికెట్‌తీసుకొని లోపలికి వెళ్ళి, నవ్వుతో ఎవరితోనో మాట్లాడుతున్నది. హన్మూ సహనం చచ్చి పోయి, దిక్కులు చూస్తూ నుంచొన్నాడు. నాలుగు నిమిషాల తరువాత ఆ అమ్మాయి వచ్చి, కంప్యూటర్‌కీ బోర్డు మీద తన చక్కటి తెల్లటి వేళ్ళతో టకటకలాడించి, హన్మూ వైపు చూసింది. ఒక్కసారి హుందాగా తల ఎగరేసి, తన నల్లజుట్టును వెనక్కి తోసి, పెదవుల మీద ఎర్రని లిప్స్టిక్‌తో చిరునవ్వుని కలిపి, సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది. "సారీ మిష్టర్‌హన్మూ, విండో సీట్లు లేవు. మధ్యలో ఇస్తున్నాను" అన్నది, తన అందమైన పలువరసలోని రత్నాలను జిగేల్ మనిపిస్తూ.

ఆ నవ్వుకి హన్మూకి కోపం వచ్చింది. "నేను మూడు నెలల క్రితం టికెట్‌రెజర్వ్‌చేసుకొనేటప్పుడు అడిగాను, విండో సీటు కావాలని" అన్నాడు కోపంగా. "అయి ఉండవచ్చు. కానీ కంప్యూటర్‌అలా చూపించటం లేదు. ఇది ఫుల్‌ఫ్లైట్ అవడం వలన ఇంతకన్నా నేనేమీ చేయ లేను" అన్నదామె. "సరే కానీయండి" అన్నాడు హన్మూ నిస్సహాయంగా. హన్మూ సూట్‌కేసుని పైకెత్తి, కన్వేయర్‌బెల్ట్‌మీద ధణేల్‌మని పడేసిందామె. హన్మూ మళ్ళీ కోపంగా, "దాంట్లో పగిలిపోయే బహుమతులున్నాయి. విరిగి పోతాయేమో, కాస్త మెల్లగా పడేయకూడదూ" అన్నాడు. ఆమె "మీ లగేజి ముంబై దాకా చెక్ చేశాను. హేవ్ ఎ నైస్ ట్రిప్" అన్నది. హన్మూ ఆమెకి థాంక్స్ కూడా చెప్పకుండా, చేతిలోని బ్రీఫ్‌కేసుని చేతులు మార్చుకొంటూ, ఎయిర్పోర్టులో నెమ్మదిగా నడుస్తూ ముందుకు వెళ్ళాడు. ఇమ్మిగ్రేషన్ సెక్యూరిటీ చెక్‌లు అయ్యాక, విమానంలో ఎక్కడానికి సీట్ల నంబర్లు వరుస ప్రకారం పిలుస్తున్నారు. అయితే ప్రయాణీకులెవరూ ఆ పిలుపులు పట్టించుకోకుండా, తోసుకొని ముందుకు వెళుతున్నారు. హన్మూ అందరినీ తేరిపార చూశాడు. హిందీ వాళ్ళు, తెలుగు వాళ్ళు, పెద్ద వాళ్ళూ, చిన్న వాళ్ళూ.. – అందరూ ఒకళ్ళ నొకళ్ళు తోసుకొంటూ ముందుకు వెళుతున్నారు. చిన్నప్పుడు విజయవాడ అలంకార్ టాకీసు దగ్గర కొత్త సినిమా వచ్చినప్పుడు, తను టిక్కెట్టు కౌంటర్‌దగ్గర చేసిన యుద్ధం గుర్తుకొచ్చింది. హనుమంతుడిలా విజృంభించాడు. అందర్నీ అటూ, ఇటూ తోసేసి, ముందుకు వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

అది భోజనాల సమయం. ఎయిర్‌హోస్టెస్‌ని చూసి, "ఎయిర్‌ఇండియా హోస్టెస్‌లు పట్టు చీరలు కట్టుకొని పేరంటానికి వెళుతున్నట్లు తయారవుతారెందుకో ?" అనుకొంటున్న హన్మూ దగ్గరికి వచ్చి "ఇదిగోనండీ, మీ శాకాహార భోజనం" అన్నది ఎయిర్‌హోస్టెస్. అనే ముందు మర్యాదగా, అన్న తరువాత స్నేహ పూర్వకంగా చిరునవ్వు నవ్వింది. ఆ ప్లేట్లో ఓ చపాతీ, బంగాళా దుంపల కూర, వెజిటబుల్‌పలావు, పెరుగూ, ఒక గులాబ్‌జామ్‌ఉన్నాయి. భూమికి ముప్పై అయిదువేల అడుగు ఎత్తున, వేడి వేడి భారతీయ భోజనం ఆబగా తిన్నాడు హన్మూ. తినడం పూర్తి కాగానే ఆ ఆకాశ సుందరి వీరవాసరం వీరుని దగ్గరకు వచ్చి, "మీకోసం ప్రత్యేకంగా తయారు చేసిన భోజనం, మీరు ఆనందించారని అనుకొంటున్నాను" అన్నది ఇంగ్లీషులో. ఇంగ్లీషులో మరాఠీ కలిపిందో, లేక మరాఠీలో ఇంగ్లీషు కలిపిందో కానీ, బంగాళ దుంపల కూరలో ఇంకా ఏదో కలిపితే బాగుండుననిపించింది హన్మూకి. "ఆ! ఏం బాగు, కూరలో ఇంకా కొన్ని పచ్చి మిరపకాయలు తగిలిస్తే బాగుండేది, కారంగా లేదు" అన్నాడు, ఆంధ్రా గోడ్డు కారాన్ని తలచుకొంటూ. పిల్లలు పుట్టిన తరువాత, తన భార్య "పిల్లలు ఎక్కువ కారం తినలేరు" అని, ఇంట్లో అన్ని పదార్థాలలోనూ, కారం పూర్తిగా తగ్గించేసి పదిహేనేళ్ళు దాటిందని అప్పుడు మరచిపోయాడు హన్మూ.

ఈ కథలో జక్కన్న, హన్మూ ఒకరే అని చెప్పాను. ఒకే మనిషికి ఇలా రెండు మనస్తత్వాలు వుండటం ఈ కథలో హీరోకి మరి కొందరికీ మాత్రమే పరిమితం కాదు. ఇలాంటి వాళ్ళను మనం నిత్య జీవితంలో ప్రతిచోటా చూస్తూనే ఉంటాం. మనలను నిశితంగా పరిశీలించుకొంటే, మనలో కొంత మందిలో అటువంటి లక్షణాలు ప్రస్ఫుటంగా కనబడ్డా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎందుకు మనుష్యులు అలా ప్రవర్తిస్తారు ? దానికి కారణాలు ఏమిటి ? అన్నది వివరంగా వ్రాయటానికి నేను మనస్తత్వ నిపుణుడిని కాను. ఒకవేళ అటువంటి శాస్త్రవేత్తల సహాయంతో విశ్లేషించి, విపులీకరిస్తే, ఈ కథను ఏ సైకాలజీ పత్రికకో పంపాల్సి వస్తుంది. అందుకని నా బాణీలో ఈ కథ వ్రాశాను, కథ చదివిన తరువాత, ఈ విషయం గురించి ఆలోచించ వలసింది మీరు..

***India's Independence Day Celebration – ICC-Austin celebrates the grandest event of the year!***

**Date: Sat., August 17th Venue: Performing Arts Center, John Conally High School Time: 7 p.m.**

Come join us for a fun-filled evening celebrating the day of India's Independence! Food, friends, quality entertainment, and lots of festivities are all yours this evening! Join the local Indian community and celebrate this incredible event! Be entertained by our own Jitin Hingorani, of News 8 Austin fame, the Master of Ceremony, and professional music groups.

**For more details, please visit - http://iccaustin.org**

## ఛందస్సు - ఒక పరిచయం

**- జెజ్జాల కృష్ణ మోహన రావు**

వేదములు నాలుగు. అవి ఋక్, యజుర్, సామ మఱియు అధర్వ వేదములు. మొట్ట మొదట వేదములలో ఛందస్సును పయోగించిరి. వేదత్రయమును ఛందస్సు అని కూడ అంటారు. సామ వేదమంతయు ఛందస్సే! వేదముల యొక్క అంగములను వేదాంగములని చెప్పెదరు. అవి ఆఱు- శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్త, జ్యోతిష, కల్ప. "శిక్షాం వ్యాఖ్యాస్యామః వర్ణస్వరః, మాత్రాబలం సామ సంతానః" అనగా అక్షరశుద్ధి (ఉచ్చరణ), స్వరశుద్ధి (శారీరము), మాత్రాశుద్ధి (కాల దైర్ఘ్యము), బలము (వేగము), సామము (సమత్వము), సంతానము (అభంగము) ఇవన్నీ పద్య పఠనములో ఉండాలి. వీనిని పొందు విధానమే శిక్ష.ఛందస్సు అనగా పద్యములను వ్రాయు విధానము. ఋగ్వేదము మఱియు సామ వేదము సంపూర్ణముగా పద్య (శ్లోక) రూపములో నున్నవి. యజుర్వేదములో గద్యము కూడ ఉన్నది. వేదములలో గల ఛందస్సులు అనుష్టుప్ (8 అక్షరములు), బృహతి (9), పంక్తి (10), త్రిష్టుప్ (11), జగతి (12) అనబడు ఛందములకు చెందినవి. మిక్కిలి ప్రఖ్యాతి గడించిన ఛందస్సు త్రిపద గాయత్రీ ఛందస్సు. అది "తత్సవితుర్వరేణియం, భర్గోదేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్" కొందఱు మొదటి పాదములో వరేణ్యం అనెదరు. అప్పుడు గాయత్రి ఛందస్సుకు 23 అక్షరాలే. ఇది గాయత్రిలో ఒక ప్రత్యేకమైనది.

బ్రహ్మ-విష్ణు-శివులను త్రిమూర్తులనుట వాడుక. అదే విధముగా ప్రతి మంత్రమునకు త్రిమూర్తులు ఉన్నారు. అవి (వారు) ఋషి, ఛందస్సు, దేవత. నిరుక్తము అనునది నిఘంటువు లేక కోశము. కల్పము అనగా వేద విధులను చేయు విధానము. ఛందస్సును మనము చదువుచున్నాము అంటే ఆఱు వేదాంగములలో ఒక్కటిని పరిశీలించి అర్థము చేసికొంటున్నాము అన్న మాట! కావ్యములలో వాడబడునది ఛందస్సు; మిగిలిన వేళలలో వాడబడునది భాష. ఈశ్వరుడు పార్వతికి ఛందస్సును బోధించినాడట! దానిని విని పింగళాచార్యుడు ఛందస్సు శాస్త్రమును వ్రాసినాడట. పింగళాచార్యుడు ఇప్పటి కర్ణాటక దేశ వాసుడని ప్రతీతి. దశమూల సంఖ్యా గణితములో (decimal arithmetic) శూన్యము (సున్న) భారతీయుడు ఒకడు పురాణ కాలములో కనుగొన్నాడని మనము భావిస్తున్నాము. నవీన యుగములో కంప్యూటర్లు ద్వయ మూల సంఖ్యా గణిత (binary arithmetic) సిద్ధాంతములపై ఆధార పడి యున్నవి అన్న విషయము జగద్విదితమే! ఈ బైనరీ అరిత్మెటిక్ ఛందస్సులో వాడబడుట తెలిసిన విషయమే. కావున నా ఉద్దేశ్యములో శూన్యము (సున్న) తఱువాత గణిత శాస్త్రమునకు మనము అందించినది ఈ బైనరీ అరిత్మెటిక్కే! య-మా-తా-రా-జ-భా-న-స-ల-గం ప్రపంచ విజ్ఞానములో ఒక నూతన కాంతిని చల్లింది, అంటే అతిశయోక్తి కాదు!

తెలుగు ఛందస్సు సంస్కృ త ఛందస్సు పైన ఆధార పడి ఉండటమే కాక, క్రొత్త సృష్టిని కూడ చేసినది. సంస్కృత వృత్తాలతో బాటు జాతులు, ఉపజాతులు తెలుగులో ప్రత్యేకత! ఇప్పటి పాఠకులు, లేఖకులు, నవ కవులు, విప్లవ కవులు ఛందస్సు అంటే పురాతనమైనది అనియు, ప్రగతి నిరోధకము అనియు తలుస్తారు. కాని సినిమా పాటలలో, శ్రీ శ్రీ గేయాలలో మాత్రా ఛందస్సు సుశోభితమై విరాజిల్లుచున్నది. పురాతన ఛందస్సులో నున్న అంశాలను అవగాహన చేసికొని క్రొత్త నడకను, ఛందస్సును కల్పించవచ్చు. కేవలము గణ-యతి-ప్రాసలు మాత్రమే కాక పద్యాలలో నున్న గమనమును, సంగీతమును, మాత్రాబద్ధతను పరిశీలించుట చాల అవసరము.

కవిత్వము నాల్గు విధములు. అవి- ఆశు, చిత్ర, బంధ మఱియు గర్భ కవిత్వములు. ఆశు కవిత్వము అనగా ఉన్నట్లుండి పద్యములను అల్లుట, వ్రాయుట. అల్లసాని పెద్దన శ్రీ కృష్ణదేవరాయల ముందు ఆశువుగా చెప్పిన ఉత్పలమాలిక సుప్రసిద్ధము గదా! చిత్ర కవిత్వము అనగా ఒక రెండు అక్షరములతో లేక కొన్ని విచిత్రమైన నియమములతో పద్యములను వ్రాయుట. బంధ కవిత్వములో పద్యమును ఒక చిత్రములో (పాము, కత్తి, కమలము, ఇత్యాదులు) వ్రాయుట. గర్భ కవిత్వము తెలుగు భాష యొక్క ప్రత్యేకత. మిగిలిన భాషలలో (సంస్కృతముతో సహా) గర్భ కవిత్వము ఉందో లేదో నాకు తెలియదు. లేదనే అనుకొంటాను. రెండు రకములైన పద్యముల నడకను, గురులఘువుల భంగిమను, మాత్రాసంఖ్యలను పరిశీలించి ఒక పద్యములో మరొకటి ఇమడ్చ వీలగునా?, అన్నదే గర్భ కవిత్వములోని ప్రాధాన్యత.

## వింటున్నావా???

**- శ్రీనివాస ఫణికుమార్ డొక్కా**

మనసులోని గాయాలకు మమత పసరు పూసుకో,
చెదరిన నీ ఎద ముగ్గును తిరిగి తీర్చిదిద్దుకో,

లక్ష విలయములు రేపినా దాక్షాయణి వచ్చేనా?
బిచ్చగాడు కోపపడుట లక్షణమౌపనియేనా?

మూడు కన్నులిచ్చినా మూసుకునే కూర్చుంటే
ఏడు జన్మల తోడు ఆ పార్వతి ఇహ కనబడినట్టే !

మన్మధుణ్ణి మసిచేసే మనసు చల్లబడుతుందా?
ఆ భస్మ లేపనంతోనే నీ భారం దిగిపోతుందా?

పాములతో చెలిమి చేసి,
"పగే" నా నువ్వు నేర్చుకున్నది?
గరళాన్నే మింగిన సహనం,
ఈ నాడే "పుట్ట"న దూరింది?

జాబిలంత తెల్లని హృదయం నీది -
ప్రేమ వెన్నెలలు కురిసే రోజొచ్చింది,
పరిణయానికే సమయమిది -
పార్వతీ పాణిగ్రహణమే నీ విధి !

మళ్ళీ మళ్ళీ చెబుతున్నా, మన్నించు మహాదేవా,
కళ్ళ ఎదుట వున్నది - నీ కాత్యాయనే మహానుభావా !!

ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం సమర్పించు సంగీత విభావరికి స్వాగతం ! ! !

## *Telugu Cultural Association, Austin*

***invites everyone for an enchanting evening of Mela with lots of interesting stalls, Karaoke, songs, games, food and fun.***

కార్యక్రమ విశేషాలు: ఆసక్తి కరమైన మేళా, నోరూరించే తినుబండారాలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు మరియు కారియోకి పాటలు

## Admission: FREE
## Date: July 20th 2002
## Time: 6 P.M. – 10 P.M.
## Venue: Murchison Middle School

Directions: Coming from Mopac/Loop 1 North, Take right on Far West Blvd exit. Take a left at 2nd/3rd traffic light onto Hart Road and a right at the STOP sign. The school is on the right side.

Contact austintelugu@yahoo.com, if interested in singing/karaoke and/or setting up stalls.

**TCA welcomes articles and advertisements for Telugu Vani Dasara/Dipavali issue.**

Be a proud member of TCA, participate in its activities and encourage others to join TCA !!

***TELUGU CULTURAL ASSOCIATION***
*(A registered non-profit Organization)*
**2900 West Anderson Lane,**
**Box # 20-216A**
**Austin, TX 78757-1124**